రూపాయి తీసుకుని సుబ్బిగాడితోటు కోటయ్య కొండకు చల్ మోహనరంగా అనుకుంటూపోవాలి. రంకులరాట్నం యెక్కాల్సిందే. కళ్ళు తిరిగినా మానె. పడిచచ్చినా సరే రంకులరాట మెక్కి తిరగాల్సిందే, గుఱ్ఱంమీద కూకుని గట్టిగా పట్టుకుని కళ్లు మూసుకుంటే మూసుకుంటేసరి కళ్లు తిరగవు, పాడు తిరగవు. జిలేబీ కొనుక్కోవాలి, చెరుగ్గడలు కొనుక్కోవాలి. సుబ్బిగాడు ఇప్పుడు నిదరలేచి వచ్చినట్లుంది. పాదుకాడ కూచుని చెత్తదీస్తున్నాడు. వాడికేం వాల్లమ్మ డబ్బులిత్తుంది.

మొన్నీమధ్య వాడు కొత్తచొక్కా, కొత్త షరాయి కట్టిచ్చుకొని ఎప్పుడూ తన ముందుకే నిలుచుండేవాడు. తనకేగాంద కొత్తచొక్కా వుందని. తనకుకూడా కొత్తచొక్కా కుట్టిచ్చమని అడిగితే అట్లగు లెగుస్తది. రోజూ పిలిచినారని సుబ్బిగాడు, "ఆడుకుందాం, రారా, రత్తిగా," అని మూడుసార్లు పిలిచాడు. ఆడుకుంటుండగా తన బురదచెయ్యివాడి చొక్కాకు తగిలింది. సుబ్బిగాడు తననికొట్టి వాళ్ళమ్మ తోటుపోయి చెప్పాడు, "కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారటరా" అని సుబ్బిగాడి అమ్మవచ్చి గుడిసెముందు నిలబడి తిట్టు పోసింది.

ఈ యేటు సామిదయవల్ల పొట్లపాదు బాగా కాస్తే ఎండల కాలంలో సుబ్బిగాడు సంపాయించే డబ్బులకంటే ఎక్కువే వస్తయి. కొత్త చొక్కా, కొత్తషరాయి కుట్టించుకోవచ్చు— పోయి సుబ్బిగాడిముందు నిలబడి చూపించవచ్చు. వాడంటే తనకు మంట.

మర్రోజు ప్రొద్దున్నే రత్తిగాడు పాకకాడ కూకొని ముఖం కడుక్కుంటున్నాడు.

"ఒరే రత్తిగా వాళ్ళ పుచ్చపాదును పందికొక్కు కొట్టేసింది. సూడు యెట్లా ఎండిపోయిందో నిన్నెంత బాగుండదిరా" అంది అమ్మ. రత్తిగాడు వులిక్కిపడ్డాడు. ఇంకేమీ మాట్లాడలేదు.

మర్రోజు రత్తిగాడు పొట్లపాదుకాడ కొచ్చేటప్పటికి, పాదు మాడిపోయివుంది. దుంప తెగిపోయివుంది. అక్కడనే కూలబడి రత్తిగాడు భోరున యేడ్చాడు.

"పందికొక్కు మరిగిందిరా నిన్న వాళ్ళది కొట్టేసింది. ఇయ్యాల మనది కొట్టేసింది" అంది అమ్మ. రత్తిగాడు యేడుస్తునే వున్నాడు.

నిన్నరాత్రి వెన్నెట్లోని పుచ్చపాదు దుంపయొక్క సౌకుమార్యం వాడికళ్ళలో మెరుపు మెరిసినట్టు కొట్టింది వాళ్ళమ్మ పందికొక్కును బూతులు తిడుతున్నది.

---

స్కెచ్

# నష్టజాతకుడు

అమంచి మధుసూధనరావు

కనిపించే మనుషులు కంఠంమీద కాలేసి తొక్కిపెడుతుంటే, కనిపించని గ్రహాలు బలంగా లేవంటూ వేదాంతం చెపుతాడు మా మహేశం.

1949నాటి సంగతి. ఇంటరు ఫస్టుక్లాసులో పాసయిన మా మహేశం ఇంజనీరింగు కాలేజికొకటి, మెడికల్ కాలేజీ కొకటి అప్లికేషన్లు పడేసాడు. 'నువ్వూ ఒక మనిషివి, నీదీ ఒక దరఖాస్తు' అన్నట్టు, ఆయినకాడికి పదిరూపాయలు ఫీజుగా మింగి మొండిచెయ్యి చూపించారు ఇంజనీరింగు కాలేజీవారు. జవాబయినా ఇవ్వలేదు మెడికల్ కాలేజివారు." మన జాతకంలో డాక్టరూ, ఇంజనీరూ అయ్యేయోగంలేదురా" అన్నాడు మా మహేశం. ఏమి చెయ్యడానికి తోచక తికమక పడిపోతున్న మహేశానికి, యెవరికి తోచిన సలహా వారు సెలవిచ్చారు. ఒక బుద్ధిమంతుడు చాల సింపుల్‌గా తేల్చిచెప్పాడు. "ఇంటరుతర్వాత చెయ్యవలసిందేమిటని గింజుకోవలసినంత అవసరమేంముందోయి! మనకి మెయిన్‌రోడ్డు వుండనే వుందిగా. బి. ఏ., బి. ఎస్. సి; బి. కాం; యేదో ఒకటి చదివేయి."

ఆ ముచ్చట కూడా తీరింది. అక్షరాల రెండు వేల రూపాయిల ఖర్చుతో బి. ఎస్. సి. అనిపించుకున్నాడు. మళ్ళీ వచ్చింది వెధవ ఫస్టుక్లాసు! ఇపుడేం చెయ్యడం ఎమ్. ఎస్. సి. చదవమన్నారు పెద్దలు. 'రెండెకరాలు అమ్మేద్దాంలే' అన్నాడు తండ్రి—ముందుముందు కొడుకు గెజిటెడ్ ఆఫీసరు కాకపోతాడా అని. దానికిమాత్రం సీటెవడిస్తాడు! మేనమామల్లాంటి శాస్త్రీ లేమీ ఆంధ్ర విశ్వవిద్యాలయ పరిసరాల్లో లేవు మావాడికి. అధమం కూతురి నిస్తాననే మేనమామగారిలాంటి పదార్థం విశాఖపట్టణం పొలిమేరల్లో కనిపించే ఆశ కూడా లేదు మా జజ్జుగాడికి. ఒకవేళ సీటు యిచ్చినా మనకి కావలసిన సబ్జక్టుతో ఇవ్వరు. 'ఏ మొగుడూ లేకపోతే' అనే స్థితిలో వారిచ్చిన సబ్జక్టుతోనే సముద్రాన్ని చూసి కడుపు నింపుకోవలసిన పిఠాపూర్ హాస్టల్లోనే, ఒక శుభముహూర్తాన ప్రవేశించాడు మా మహేశం. అక్షరాల రెండు ఎకరాల ఆవిరితో ఎం. ఎస్. డిగ్రీ చేతికొచ్చింది మావాడికి.

ఇప్పుడేం చెయ్యాలి? అదే ప్రశ్న. అదే ప్రోబ్లమ్. వాయిదాపడుతూ యీనాటికి యెదురవుతున్న సమస్య. ప్రొఫెసర్లు కాట్లాడుకుని కుర్రాళ్ళకి థర్డుక్లాసు యివ్వటంలాంటి గండాలు తప్పించుకుని సెకండుక్లాసులో పాసయ్యాడు వాడు. అది కొంతలో కొంత మేలు! సెంట్రల్ గవర్నమెంటువారు పిలుస్తారని ఆశతో ఆగాడు ఆరునెలలు. పిలిచారు. అప్లికేషన్లు వెళ్ళాయి ఆంధ్రయూనివర్సిటీనుంచి ఒక్క కేండిడేటుని కూడా పిలవలేదన్నారు. మావాడి కాళ్ళు చల్లబడ్డాయి. "మనది నష్టజాతకం" అన్నాడు మా వాడు. వాడిదికాదు నష్టజాతకం, ఆంధ్ర యూనివర్సిటీది అన్నారు ఒళ్లుమండిన యువకులు. మా వాడికి గెజిటెట్ పోస్టు ఆశ చచ్చింది. కనిపించిన అడ్వర్టయిజుమెంటు కల్లా అప్లికేషన్లు పెట్టాడు. కాని ఫలితం శూన్యం. మరొక్క ఆరు సెలలు గడిచాయి. మావాడి ఎం. ఎస్. సి డిగ్రీకి సంవత్సరం నిండి, సంతోషంగా పుట్టిన రోజు పండగ చేసుకుంది.

"ఎం. ఎస్. సి. పాసయినావట? ఏంచేస్తున్నావోయి?" వాళ్ళ చంటితమ్ముడు చంక నాకుతున్నాడు! వాడేం చేస్తే వీళ్ళకెందుకు తెలియక అడిగితే అందం తెలిసి, వాడిని యేడిపించాలని అడిగేవాళ్ళని తస్సాదియ్యా వాళ్ళకేం, రోగమా! ఉద్యోగం లేదనే యేడుస్తాడా! ఊళ్ళోళ్ళవాళ్ళకి సమాధానం చెప్పలేక యేడుస్తాడా! మరొక ఆరు నెలలు గిర్రున తిరిగాయి. మావాడి కళ్ళనీళ్లు తిరిగాయి. "ఏరా మధూ" అన్నాడు. నేను మహా పొడిచి చచ్చాను కనకనా! వాడికి సలహా చెప్పడానికి కాదంటే కాస్త మొండికెత్తాను. ఏడుస్తావెందుకురా దుంపా! ఈ రోజుల్లో అప్లికేషన్లకి ఉద్యోగాలు రావురా! పట్టుకో ఎవడినో. అవసరమయితే వసుదేవుడంతటివాడు గాడిద కాళ్లు పట్టుకున్నాట! నువ్వూపట్టుకో ఒక గాడిదని! 'దేముడు నాన్న'లు లేందే ఉద్యోగాలు రావురా జజ్జు! పట్టుకో ఒక క్షత్రకుడిని కమిటీ కాలేజీలో లెక్చరరుగా నయినా చేరొచ్చు."

"మావాళ్ళు ప్రయత్నిస్తూనే వున్నారురా! మన జాతకం యిలా వుందిగాని."

"............."

"ఎ. జి. ఆఫీసుకు నేనూ పెట్టానా? నాకు రాలేదు. రావుగాడికి, మూర్తిగాడికి, శర్మగాడికి వచ్చింది. ఇంటలిజెన్సు-బ్యూరోనుంచి విశ్వానికొచ్చింది. పుండరికొచ్చింది. వాళ్ళవొద్దనేసారు. నాకు కావాలి! నాకొచ్చిందిరా? ఇదేరా నష్టజాతకమంటే."

"నీకు రాలేదని యేడవక యెవడికో కాండూరి లక్ష్మీంపతి కొచ్చిందంటూవేరా! వాళ్ళని యెవడో పిలకపట్టుకు లాగాడు కనక వచ్చింది. నువ్వూ ఎవరినైనా పట్టరా అంటే జాతకం అంటావేమిటిరా! జాతకం, సింగిధనామూను."

"మధూ! నువ్వు ప్రతీదిలైట్ గా తీసిపారేస్తావు. ఏదీ సీరియస్ గా పట్టించుకోవు. జాతక ఫలంకాకపోతే శేషగిరి రావుగాడు నాలుగువేలు డొనేషను యివ్వటానికికూడ సిద్ధపడ్డాడే! హిందూ దేశంలో యే మెడికల్ కాలేజిలోనైనా సీటొచ్చిందా వాడికి! నష్టజాతకం కాకపోతే 1958 వరకు సీట్లు రిజర్వు అయిపోవడ మేమిటిరా! అంతకంటె దరిద్రజాతకుడు మన ఎస్. ఎమ్. కుట్లగాడు. వాడికి మధ్యాహ్నం రెండుగంటలకి రాజమండ్రీలో టైపు ప్రేక్టికలు పరీక్షైతే, పొద్దున్న

పదిగంటలకి టెలిగ్రాం వచ్చింది. రాజోలులో వున్న కుట్లగాడు ఎప్పుడు రాజమండ్రి వెడతాడు? యెలా పరీక్షకి కూర్చుంటాడు? పేసయిన థీయరీ కూడ క్షౌరమయి పోయింది. నష్టజాతకం కాక ఏమిటిరా?

ఇదీ మావాడి వేదాంతం. వున్నట్టుండి ఒక రోజు హఠాత్తుగా...పురం ప్రయాణమయ్యాడు మహేశం. ఏమిటిరా అంటే దయానిధిగారి దగ్గర కన్నాడు.

"ఒరే మహేశం! నేతిబీరకాయలో నెయ్యి, ధర్మాసుపత్రిలో ధర్మం, దయానిధిగారిలో దయ,–ఇవన్నీ పేర్లురా నాన్నా! దారిఖర్చులు కూడా యెందుకు దండగ పెడతావు!"

నవ్వుకుంటూ వెళ్ళిన మహేశం, సాయంత్రం గోదావరి గట్టుమీద ఆముదం తాగిన వాడిలా ముఖంపెట్టి 'అరచేతిలో వైకుంఠంరా' అన్నాడు.

కాలేజిలో డిమాని స్టేటరు పోస్టు కోసం ఇంటర్వ్యూ కెళ్ళాడు మావాడు. ఎనమండుగురు మెంబర్లలో (అందులో ఒక్కడికీ ఫిజిక్సు రాదు. వీళ్లే ఇంటర్వ్యూ చెయ్యడం!) అరడజను మంది మావాడిని సెలక్టు చెయ్యడానికి ఓటు చేశారు. మిగిలిన ఇద్దరూ చెరొక కేండిడేటుని తీసుకొచ్చారు. ఇక 'మా కేండిడేట్' అంటే 'మా కేండిడేట్' అని కుక్కల్లా పబ్లిక్ మీటింగులో కాట్లాడుకున్నారు కమిటీ మెంబర్లు. చివరికి యీ ముగ్గురినీ వదిలి మరొక కేండిడేటుని సెలక్టు చేసారు ప్రిన్సిపాలుగారు. తెల్లమొహం వేసుకుని వెనక్కొచ్చాడు మావాడు.

"పెళ్ళి చేసుకోవోయి. పిల్ల అదృష్టం బాగా ఉంటే నీ రోజులు మారతాయి." పెద్దల సలహా.

"కాఫీకి డబ్బులులేక చస్తుంటే, రిబ్బన్లు, పౌడర్లు యెలా తేవటం!" మావాడి గోల.

"శాంతి చేయించండి. గ్రహశాంతి జరిగితే జాతకం తిరగబడుతుంది." సిద్ధాంతిగారి ఆశ. జాతకం తిరగబడుతుందో లేదోకాని ఆ ఖర్చుతో వాడి పరిస్థితిమాత్రం తప్పకుండా తిరగబడుతుంది.

"మా అమ్మాయిని చేసుకుంటే కాలేజిలో లెక్చరరుగా వేయిస్తాను." "మావగార్ల హడావిడి. (ఆయన కూతుర్ని చేసుకోకపోతే వీడు మట్టి కొట్టుకు పోయినా ఆయన కక్కరలేదు.)

"ఆత్మహత్య చేసుకోవటం మంచిదిరా!" మా వాడి నిర్ణయం.

"నిజమే! మంచిదే కాని అందుకు గుండె ధైర్యం కావాలిరా! నీ కదివుంటే వుద్యోగమే దొరుకుతుంది." నా అభిప్రాయం.

రోజులు గడుస్తూనే వున్నాయి. బూజులు పెరుగుతూనే వున్నాయి. ఆకాశం విరిగిపడి పోలేదు. భూమాత కంపించి పోలేదు. డిగ్రీలు యివ్వబడుతూనే వున్నాయి. విద్యార్థులు చదువుతూనే వున్నారు. ఇవాళ ఇంటరు చదివేకుర్రాడిని రెండు సంవత్సరాల తరువాత చదవబోయే మెడిసిన్ కోసం (వాడు సవ్యంగా పాసయి చస్తే) ఇవాళ్ళినుంచీ సీట్లు రిజర్వు చేస్తూనేవున్నారు. నాలుగు సంవత్సరాల తరువాత రాబోయే ఫలానాగారి కొడుకు కోసం ఉద్యోగాలు ఖాళీగా పడి యేడుస్తూనే వున్నాయి. మా మహేశానికిమాత్రం పవిత్రమైన బంగారం లాంటి భారతదేశంలో యెక్కడా వుద్యోగం దొరకలేదు. వెర్రివెధవ అన్నాయి నెరిసిన వెంట్రుకలు. (మంచి వెధవకి మారుమాట) దొరవలేదన్నారు కాళీగా కూర్చుని పిల్లల్ని కంటున్న యువకులు. వూరిలోని పెద్దలంతా ఏకగ్రీవంగా నష్టజాతకుడన్నారు. తల్లిలేని పిల్లాడూ, పనిలేని మగాడూ, అందరికీ లోకువంటారు. పడేవాళ్ళని కాకపోతే యెవరినంటాం! మీకు తోచింది మీరూ అనండి.

---

"మా మేనమామ ఎంత గొప్ప సంగీత విద్వాంసుడంటే–చెవులతో హార్మోనియం వాయిస్తాడు!"

"అదేమంత గొప్ప! మా పినతండ్రిని మీరెప్పుడూ చూడలేదు గాబోలు! ఆయన ఫిడేలు మీసాలతో వాయించేస్తాడు!"